# సంపాదకీయం

శనివారం 22-07-2023

## మణిపూర్ అమానుషానికి ఎవరు బాధ్యులు ?

గత రెండు మాసాలుగా హింసాకాండ, అల్లర్లతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో జరిగిన ఘటనలు ప్రభుత్వ వైపల్యం తప్ప మరోటి కాదు.జాతికి తీరని మచ్చను తెచ్చిపెట్టాయి. మణిపూర్‌లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్న విషయం మరోమారు రుజువు చేసింది. ఇకపోతే బుధవారం రాత్రి వెలుగు చూసిన ఒక వీడియోపై దేశవ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు రగిలాయి. రాజకీయ పార్టీలు, నేతలే కాకుండా సుప్రీంకోర్టు కూడా తీవ్రంగా స్పందించింది. ఈ ఘటన మాత్రమే బయటకు వచ్చిన నిజం. గత రెండు నెలలుగా జరిగిన హింసాకాండలో 140మంది మరణించినట్లు అధికారికంగా వెల్లడయ్యింది. అయితే ఈ అల్లర్లలో ఎంతమంది మరణించారో తెలియదు. ఇక నగ్న ఊరేగింపు వీడియో చూసిన తరవాత ప్రతి ఒక్కరూ బాధను, ఆగ్రహాన్ని కూడా వ్యక్తం చేశారు. అందులో ప్రధాని మోడీ కూడా ఉన్నారు. కానీ అధికారంలో ఉండికూడా మణిపూర్ హింసాకాండను అణచివేయడంలో అక్కడి బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. ఇంతకాలం మౌనంగా ఉన్న మన ప్రధాని మోడీ పార్లమెంట్ ముందు ఆగ్రహం ప్రకటించడం పూర్తిగా నిర్లక్ష్య భావన తప్ప మరోటికాదు. ఇంతకాలం ఆయన మణిపూర్‌పై ఎందుకు స్పందించలేదు. ఎందుకు చర్యలకు ఆదేశించలేదన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలి. పార్లమెంటులో ఇంతకు మించిన చర్చించాల్సిన అంశం మరొకటి ఉండదు. నిజానికి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ సమావేశాల రోజే దీనిపై చర్చించి ఉంటే కొంతయినా మర్యాద దక్కేది. మాటలతో మభ్యపెట్టే బదులు..చర్యలు తీసుకుని ఉంటే ప్రజల్లో భరోసా పెరిగేది. ప్రజల మానప్రాణాలకు విలువ లేకుండా పోయిందనడానికి మణిపూర్ ఘటన చక్కని ఉదాహరణ. అలాగే అక్కడి ప్రభుత్వం అచేతనంగా ఉందని కూడా తేలింది. నిజానికి ఇద్దరు మహిళల నగ్న ఊరేగింపు వీడియో బయటకు రాకుంటే ఈ ఘటన ప్రపంచానికి తెలిసేది కాదు. కొంతమంది అల్లరి మూక కుకీ తెగకు చెందిన 20, 40 ఏళ్ల వయసులో వును ఇద్దరు మహిళలను బి ఫైనవ్ గ్రామ సమీపంలో నగ్నంగా రోడ్డుపై నడిపించుకుంటూ సమీపంలోని పొలాల వద్దకు తీసుకెళ్లడం ఆ వీడియోలో కనిపిస్తోంది. వారిలో కొంత మంది ఆ ఇద్దరి శరీర భాగాలు అసభ్యంగా తడుముతూ బలవంతంగా నెట్టు కుంటూ తీసుకెళుతున్న దృశ్యాలు సభ్యసమజాం తలదించుకునేలా చేసింది. మే 4న ఈ ఘటన జరగగా, మే 18న దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులే తమను ఆ దుండగులకు అప్పగిం చారని మణిపూర్ బాధిత మహిళల్లో ఒకరు మీడియాకు తెలిపినట్లు తెలుస్తోంది. మా గ్రామంపై దాడి చేసిన అల్లరి మూకతోనే పోలీసులు కూడా వున్నారని చేసిన ఆరోపణలపై ప్రభుత్వం స్పందించాల్సి ఉంది. మమ్మల్ని ఇంటికి సమీపం నుంచి తీసుకెళ్లిన పోలీసులు కొంత దూరం వెళ్లిన తర్వాత రోడ్డుపై ఆ అల్లరి మూక దగ్గర వదిలేసి వెళ్లిపోయారు. పోలీసులే మమ్మలి వారికి అప్పగించారని ఆ మహిళ చెప్పారు. తామిద్దరిలో చిన్నదైన మహిళపై పట్టపగలే దారుణంగా సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని మరో మహిళ తెలిపింది. కాంగ్‌పోక్పి జిల్లాలోని తమ గ్రామంపై దాడి జరగడంతో తామందరం ఆశ్రయం కోసం సమీపం లోని అడవుల్లోకి పారిపోయామని చెప్పారు. పోలీసులు తమను పోలీసు స్టేషన్‌కుతీసుకువస్తుండగా, స్టేషన్ కురెండు కిలోమీటర్ల దూరంలో అల్లరి మూక అటకాయించి మమ్మల్ని లాక్కెళ్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తంగా అయిదుగురు ఆ గ్రూపులో వున్నారని చెప్పారు. యువ మహిళ తండ్రి, సోదరుడినికూడా ఈ మూక చంపేసినట్లు ఆమె తెలిపారు. ఆ గ్రూపులో కొద్దిమందిని గుర్తు పట్టగలనని బాధిత మహిళ తెలిపారు. వారిలో ఒకరు తన సోదరుడి స్నేహితుడిగా తెలుసునని చెప్పారు. తమని ఇలా నడిపించుకుంటూ తీసుకెళ్లిన ఘటనకు సంబంధించి వీడియో వుందన్న విషయం కూడా తమకు తెలియదని బాధిత మహిళ తెలిపారు. తాజాగా ఈ వీడియో వైరల్ అవడంతో దేశవ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు రగులుతున్నాయి. ఇంత జరిగినా పోలీసులు ఏం చేస్తున్నారన్నదే ప్రశ్న. అలాగే అక్కడి ప్రభుత్వం ఏం చేస్తోంది. చిన్న రాష్ట్రం అయిన మణిపూర్‌లో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం దారుణం. ఘటనపై గురువారం దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు తలెత్తిన నేపథ్యంలో తక్షణమే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఘటన జరిగిన రెండు మాసాల తర్వాత ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఇద్దరిని అరెస్టు చేశారు. మిగిలిన వారిని పట్టుకునేందుకు గాలింపు చేపట్టారు. మణిపూర్‌లో వైరల్ వీడియోపై పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రధాని మోడీ తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు. సుప్రీం చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ సహితం తీవ్రంగానే స్పందించారు. ఇలాంటి అమానుషం జరుగుతున్నా ఇంతకాలం ఉపేక్షించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్య తీసుకుంటారో తామే రంగంలోకి దిగాలా అని ఆగ్రహించారు. ఈ క్రమంలో కొత్తగా నిర్మించిన భవనంలో తొలిసారి ప్రారంభమైన పార్లమెంటు సమావేశాలను మణిపూర్ ఉదంతం కుదిపేసింది. ఆ రాష్ట్రంలో జరుగుతున్న హింసపై ఉభయ సభలు హోరెత్తాయి. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించడం, అత్యాచారం చేయడం పై ప్రతిపక్షాలు గట్టిగా గళమెత్తాయి. చర్చ జరగాల్సిందేనని.. ప్రధాని నరేంద్ర మోదీ మణిపూర్‌పై సమాధానం చెప్పాల్సిందేనని పట్టుబట్టాయి. దీంతో గురువారం వర్షాకాల సమావేశాల మొదటి రోజే ఉభయ సభలు స్తంభించిపోయాయి. మణిపూర్‌లో దాదాపు మూడు నెలలుగా చోటుచేసుకుంటున్న ఘటనలపై దాదాపు ప్రతిపక్షాలన్నీ ఏకమయ్యాయి. ప్రధాని సమక్షంలో చర్చ జరగాలని డిమాండ్ చేశాయి. కాంగ్రెస్, ఆర్జేడీ, ఎంఐ ఎం, వామపక్షాలు, బీఆర్‌ఎస్‌తో పాటు పలు పా ర్టీలు సభలో అన్ని కార్యకలాపాల కంటే ముందు మణిపూర్‌పై చర్చించాలని వాయిదా తీర్మానాలను ప్రవేశపెట్టాయి. మణిపూర్ మండిపోతుంటే.. మోదీ సభ బయట మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. మణిపూర్, మణిపూర్, మణిపూర్ కాలిపోతోందని అంటూ ప్రతిపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ శుక్రవారానికి వాయిదా వేశారు. మణిపూర్‌పై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని గతం లోనే చెప్పామని.. ప్రతిపక్షాలే పారిపోతున్నాయని రాజ్యసభా పక్ష నేత, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ ప్రకటన చేయడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా చూడాలి. ఈ క్రమంలో వాదప్రతివాదాలకు తావులేకుండా మణిపూర్‌ను దారి కి తేవడంతో పాటు కఠిన చర్యలకు ఉపక్రమించాలి.

## మణిపూర్ లో మహిళలను నగ్నం గా తిప్పిన మానవ మృగాలను, ఒంగోలు లో గిరిజనుడిపై మూత్రం పోసిన మూర్ఖులను అరెస్ట్ చేయాలి

### ప్రజా సంఘాల డిమాండ్




కర్నూలు, జులై 21విభారె న్యూస్ :మణిపూర్ రాష్ట్రం లో పెట్రేగి పోతున్న దమనకాండ ను అణచడం లో కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, కుల ఉన్మాదంతో వెర్రెక్కి పోయిన అధిపత్య వర్గాల దాడులకు అంతులేకుండా పోతోందని కెవిపియస్, ఐద్వా, డివైఎఫ్ఐ, ఆర్ వి యస్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్సులు యం డి ఆనంద్ బాబు, అలివేలమ్మ, నగేష్, గురుశేఖర్, అబ్దుల్లా లు విమర్శించారు.శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా కలెక్టరేట్ గాంధీ విగ్రహం ముందు మణిపూర్ లో మహిళలను నగ్నం గా తిప్పిన మానవ మృగాలను, ఒంగోలు లో గిరిజనుడిపై మూత్రం పోసిన మూర్ఖులను అరెస్ట్ చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. కెవిపియస్ మహిళా నాయకులు డి విజయమ్మ అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపియస్, ఐద్వా, డివైఎఫ్ఐ, ఆర్ వి యస్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్సులు యం డి ఆనంద్ బాబు, అలివేలమ్మ, నగేష్, గురుశేఖర్, అబ్దుల్లా లు మాట్లాడుతూ దేశంలో అరాచకత్వం రాజ్యమేలుతున్నా మోడీ షా లు నీరో చక్రవర్తిని మించి నిద్ర నటిస్తున్నారన్నారు. మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లను నియంత్రించలేని పాలకులు, అక్కడ జరుగుతున్న అఘాయిత్యాలు మాత్రం బయటికి రాకుండా మీడియాను నిలపగలిగాయన్నారు. దేశానికి రక్షణగా ఉన్న సైనికుడి భార్యనే రక్షించలేని దేశభక్తులు పాలకులుగా ఉన్నందుకు సిగ్గుపడాలన్నారు. ముగ్గురు మహిళలను నగ్నంగా ఊరేగించి, ఆపై మానవ మృగాల్లా పైబడి అత్యాచారం చేశారన్నారు. అడ్డుకోబోయిన ఓ మహిళ తండ్రి, తమ్ముణ్ని చంపేశారన్నారు. ఇంతటి దారుణాలు జరుగుతున్న పల్లికలించే మాటలు తప్ప చేతలు శూన్యమన్నారు. మరోవైపు మధ్యప్రదేశ్ ఘటన మానక ముందే.. రాష్ట్రంలోని ఒంగోలు పట్టణ కేంద్రంలో గిరిజనుడి ముఖంపై మూత్రం పోసిన మూర్ఖులను ఫిర్యాదు చేసిన అరెస్టు చేయకుండా, సోషల్ మీడియాలో వైరల్ అయిన తర్వాత ఇప్పుడు వెతికే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మహిళలు, దళితులు, గిరిజనుల పైన జరుగుతున్న అఘాయిత్యాలలో దోషులను వెంటనే అరెస్టు చేయడంతో పాటు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ జరిపించి, తక్షణమే శిక్షలు పడేలాగా, ఇలాంటి ఘటనలు తిరిగి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో కలిసి వచ్చే వారందరిని కలుపుకొని రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని వారు హెచ్చరించారు. ధర్నా కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు అరుణమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్ సుజాత, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శిరీష, జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, నాయకులు హుస్సేన్ భాష, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎన్ జి కృష్ణ, గురుస్వామి, భాస్కర్, రోషన్న, చక్రపాణి, మద్దిలేటి, ఆర్ వి యస్ జిల్లా నాయకులు శేషాద్రి, శ్రీను, శేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులు అమర్, యోగి, సిఐటియు నాయకులు విజయ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్ లో మే 4న మహిళలపై జరిగిన దాస్తీకాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం బీఎస్పీ







కర్నూలు, జులై 21విభారె న్యూస్ : కర్నూల్ కలెక్టర్ కార్యాలయం బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంచాల లక్ష్మీనారాయణ గత మే నెల నాలుగో తారీఖున మణిపూర్ లో కుకీ తెగకు చెందిన ముగ్గురు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం వారిపై అత్యాచారం చేయడం నేటి ఆధునిక యుగంలో జరిగిన తీవ్ర అనాగరిక చర్యని బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బిజెపి పాలిత రాష్ట్రాలలో అనేకచోట్ల స్త్రీల పైన అత్యాచారాలు అఘాయిత్యాలు దళితులు మైనార్టీలు పేదవర్గాలపైన అమానుషమైన దాడులు జరగడం దారుణమని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంచాల లక్ష్మీనారాయణ, కర్నూలు జిల్లా ఇన్చార్జి ఉ కర్నూలు అసెంబ్లీ ఇంచార్జ్ అరుణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా అపర దేశభక్తులమని చెప్పుకునే బిజెపి ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థల కార్యకర్తలు నాయకులు ఇటువంటి సభ్య సమాజం తలదించుకునే సంఘటనలకు పాల్పడడం అనేది వారి నైతిక విలువలను బహిర్గతం చేస్తుందని వారు విమర్శించారు మణిపూర్లో ఉద్దేశపూర్వకంగానే ఆర్ఎస్ఎస్ వాళ్లు మోయనీల వెనుక ఉండి కుకీలపై దాడులు జరిపిస్తున్నారని ఎందుకంటే కుకీలు క్రిస్టియన్లుగా ఉండడమే వారి దయనీయమైన స్థితికి కారణం అని చెప్పి తెలియజేశారు. ప్రధానమంత్రి మోడీ గత రెండు నెలలుగా మణిపూర్ లో జరుగుతున్న మారణ హోమం గురించి ఒక్క మాట కూడా మాట్లాడకుండా విదేశీ యాత్రలు చేయడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గారు మొక్కుబడిగా మణిపూర్ణ సందర్శించి ఎటువంటి ప్రయోజనం లేకుండా వెను తిరగడం వీరి చేతగానితనమా వీరి బలహీనవర్గాలపై వీరి ప్రతీకారమా ప్రజలు ఆలోచించాలని వారు కోరారు దీని కి బాధ్యత వహించి మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు మణిపూర్లో దేశంలో మొన్న మధ్యప్రదేశ్లో ఒక బిజెపి ఎమ్మెల్యే అనుచరుడు తప్ప తాగి గిరిజన యువకుడి ముఖంపై మూత్రం పోయడం ఆంధ్రప్రదేశ్లో ఒక గిరిజన యువకుడి మొహంపై మూత్రం పోయడం తీవ్రంగా కొట్టడం ఇది మనువాదుల అనాగరిక చర్యలకు నిదర్శనం అని వారు అన్నారు ఇటువంటి చర్యలు జరగకుండా ఆపకపోతే రాబోయే 2024 ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కర్నూల్ అసెంబ్లీ అధ్యక్షులు మధు శేఖర్, కర్నూలు నగర సాదిక్ భాషా, కోశాధికారి వి. రాజేష్, కేశన్న, ఆర్.సవరన్న, యం. విజయ్, సురేష్, సౌలు రాజు, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి:- యమ్ ఆర్ పి ఎస్



కర్నూల్ ప్రతినిధి జులై 21 విభారే న్యూస్మాదిగల విశ్వరూప మహాసభ విజయవంతం చేయాలని మాదిగ ఉపకులాల సన్నహ సభను కోడుమూరు పాతబస్టాండ్ షాది ఖానా కాంప్లెక్స్ నందు జరిగిన ఈకార్యక్రమము యమ్ ఆర్ పి ఎస్ కోడుమూరు అసెంబ్లీ కన్వీనర్ ఎస్ ఆంధ్రయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిన మాదిగల విశ్వరూప మహాసభ సమావేశానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ వై విశ్వనాధ్ మాదిగ రాష్ట్ర నాయకులు రావడం జరిగిన ఈకార్యక్రమంలో విశ్వనాథ్ మాదిగ మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కోడుమూరు అసెంబ్లీ సన్నాహ సభను ఉద్దేశించి రేపు నేల ఆగస్టు మొదటి వారంలో మాదిగల విశ్వరూప మహాసభను శ్రీమన్య శ్రీమందకృష్ణ ఆదేశాల మేరకు ఏర్పాటు చేయడం జరిగినది ఈసభకు వేలాదిగా తరలివచ్చి మాదిగ విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఈకార్యక్రమంలో కోడుమూరు మండల కన్వీనర్ నగేష్ మాదిగ రాష్ట్ర నాయకులు రాచపూడి ఆనంద మాదిగ జిల్లా నాయకులు పరమేష్ మాదిగ సూరిమాదిగ రాజుమాదిగ సిద్దన్న రాముడు నాగలాపురం సురేష్ బిజెపి ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేల్పులగోపాల్ యమ్ ఆర్ పి ఎస్ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమమే జగనన్న సురక్ష ధ్యేయం

నంద్యాల మా ప్రతినిధి జూలై 21 విభారె న్యూస్ :- అర్హులందరికీ పథకాలు అందాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి అన్నారు. పట్టణంలో 25-29-31-33-28-32. వార్డుల యందు. కౌన్సిలర్ల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. ఛైర్ పర్సన్ మహాబున్నిసా మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. జగనన్న సురక్షలో అవసరమైన 11 రకాల ధృవీకరణ పత్రాలు క్షేత్ర స్థాయిలో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ద్వారా సులభతరంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు . మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి. తహసీల్దార్ శ్రీనివాసులు. అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి. ఎమ్ ఈఈ రమణ మూర్తి. ఆర్ ఓ వెంకట కృష్ణ. టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి. డీఈలు జయ భారత్ రెడ్డి. శ్రీనివాసులు రెడ్డి. మదు కుమార్. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. మున్సిపల్ సిబ్బంది. సచివాలయ సిబ్బంది. గ్రుహ సారథులు. వాలంటీర్లు. తదితరులు పాల్గొన్నారు.



## మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఆల్ క్రిస్టియన్ చర్చెస్ యునైటెడ్ అసోసియేషన్ పాస్టర్స్ డిమాండ్



పెద్దకడుబూరు జూలై21: (విభారె న్యూస్) పెద్దకడుబూరు మండలంలోని ఎమ్మిగనూరు పట్టణంలో ఆల్ క్రిస్టియన్ చర్చస్ యునైటెడ్ అసోసియేషన్ పాస్టర్స్ సమావేశమై ఉదయం 10 గంటలకు సమావేశంలో ఆల్ క్రిస్టియన్ చర్చెస్ యునైటెడ్ రాష్ట్ర ప్రెసిడెంట్ ఆనంద్ రాజ్ మాట్లాడుతూ భారత దేశంలో పలుచోట్ల క్రైస్తవ మైనార్టీలపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయని దాన్ని అరికట్టే విషయంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు విఫలమై ఉన్నాయని మాట్లాడారు మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవ చర్చిలపై పాస్టర్లపై దాడులు చేస్తూక్రైస్తవ విశ్వాసులైన స్త్రీలు పైన విచ్చలవిడిగా అవమాన పరుస్తున్న మతోన్మాద శక్తుల నుండి కాపాడి రక్షించవలసిన బాధ్యత మణిపూర్రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు ఉన్నది కావున ప్రభుత్వాలు వెంటనే స్పందించిపరిస్థితిని చూసి క్రైస్తవులపై దాడులను అరికట్టగలరని కేంద్ర ప్రభుత్వం జోక్యం తీసుకొని దాడులు ఆపాలని .ఆల్ క్రిస్టియన్ చర్చెస్ యునైటెడ్ అసోసియేషన్ పాస్టర్స్ కోరారు లేనిపక్షంలో అన్ని మండలాల్లో జిల్లాస్థాయి రాష్ట్రస్థాయిలో క్రైస్తవ ధర్నాలు రాస్తారోకులు చేయడానికి కూడా సిద్ధమవుతున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో పాస్టర్లు రెవరెండ్ జి ఆనంద్ రాజ్ ఎసిసియుఎ .రాష్ట్ర.ప్రెసిడెంట్ ఆదోని. పాస్టర్ లాజర్.పాస్టర్ రాజు. సుదర్శన్. జేసు. సుధాకర్. ప్రభుదాస్. భాస్కర్. ఇశ్రాయేలు. జైపాల్ ఇంకా తదితరులు పాల్గొన్నారు.

# పేర్ని నాని వర్సెస్ కలెక్టర్

ఏలూరు, జూలై 21, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి పేర్ని నాని వర్సెస్ ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ వ్యవహారం తాడేపల్లికి చేరింది. సెక్రెటరియేట్లో సీఎస్ జవహర్ రెడ్డి ని పేర్ని నాని కలిశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జెడ్పీ సమావేశానికి ప్రసన్న వెంకటేశ్ రాకపోవడంపై పేర్ని నాని ఫిర్యాదు చేశారు. జిల్లాల విభజన అనంతరం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికనే జరుగుతోన్న జెడ్పీ సమావేశాలకు పలువురు కలెక్టర్లు హాజరు కావడం లేదని పేర్ని నాని చెప్పారు. ప్రసన్న వెంకటేశ్ తీరుకి వ్యతిరేకంగా సీఎం జగన్ ఇంటి వద్ద ధర్నా చేస్తానని మరోసారి ప్రకటించారు. అదే సమయంలో ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్.. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ ఆఫీసుకు వెళ్లారు. పేర్ని నానితో వివాదం గురించి చెప్పారు. తాను ఏలూరు కలెక్టర్ గా ఉన్నందున ఉమ్మడి కృష్ణా జిల్లా జెడ్పీ సమావేశాలుకు వెళ్లాల్సిన అవసరం లేదని వివరణ ఇచ్చినట్లుగా చెబుతున్నారు. అదే సమయంలో పేర్ని నాని సీఎస్ ను కలిసి కలెక్టర్ పై ఫిర్యాదు చేయడంతో.. కలెక్టర్ వర్సెస్ మాజీ మంత్రి మధ్య బయటకు తెలియని ఏదో వివాదం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. జడ్పీ మీటింగ్‌లో ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ పై పేర్ని నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను గౌరవించని వారిని ఉపేక్షించకూడదని చెప్పారు. ఉమ్మడి కృష్ణాలో సమావేశాలకు రాకుండా సన్న వెంకటేశ్ రాకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. వారి తీరుపై తాను జెడ్పీటీసీ సభ్యులతో వెళ్లి సీఎం ఆఫీసు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయాల వద్ద నిరసనకు దిగుతానని హెచ్చరించారు. అవసరమైతే సీఎం క్యాంప్ ఆఫీసు ముందు ధర్నా చేస్తానని ప్రకటించడం వివాదం అవుతోంది. పేర్ని నాని ఈ వివాదంలోకి ముఖ్యమంత్రి జగన్ ను తీసుకు రావడం .. వైఎస్ఆర్సీపీలో చర్చనీయాంశమవుతోంది. కరెక్టర్లు జడ్పీ మీటింగ్‌కు వెళ్లాలా వద్దా అన్నది అధికారుల స్థాయిలో నిబంధనలను బట్టి నిర్ణయం తీసుకుంటారని.. ఇలాంటి అంశాన్ని సీఎంకు ముడి పెట్టేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారన్న చర్చ వైసీపీలో జరుగుతోంది. ఇటీవలి కాలంలో పేర్ని నాని రాజకీయంగా వివాదాస్పదంగా ప్రవర్తిస్తున్నారు. తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని చెబుతున్నారు. అదే సమయంలో ఇలాంటి వివాదాలు రేపుతూండటానికి కారణం ఏమిటని వైసీపీ వర్గాలు ఆరా తీస్తున్నాయి

## నయా స్ట్రాటజీలో టీడీపీ

విజయవాడ, జూలై 21, 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీతో పొత్తు పెట్టుకునేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వైఎస్ చౌదరి, సీఎం రమేష్‌తో సహా బీజేపీలోని ఆయన మనుషులు చంద్రబాబు నాయుడుకు అనుకూలంగా బీజేపీ నాయకత్వంతో గట్టిగా లాబీయింగ్ చేస్తున్నారు. బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ కూడా చంద్రబాబు నాయుడు కోసం గట్టిగానే లాబీయింగ్ చేస్తున్నారు. అయితే టీడీపీతో పొత్తు పునరుద్ధరణకు బీజేపీ అగ్ర నాయకత్వం సానుకూలంగా లేదు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా బీజేపీ, టీడీపీ మధ్య పొత్తును పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నాలన్నీ బీజేపీ అగ్ర నాయకత్వాన్ని మార్చడంలో విఫలం కావడంతో.. మోదీ, షాలకు చేరువయ్యేందుకు టీడీపీ అధినేత కొత్త మార్గాన్ని కనుగొన్నట్లు సమాచారం. అతను బిజెపి నాయకత్వంతో కమ్యూనికేట్ చేయడానికి ఢిల్లీకి చెందిన రాజకీయ వ్యూహకర్త అబిస్టాను కనుగొన్నాడు. అబిస్టా వివిధ రాష్ట్రాల్లో రాజకీయ సర్వేలు నిర్వహించడంలో నిమగ్నమై ఉన్నారు. కేంద్ర కార్మిక, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు సన్నిహితుడు. ఈ వ్యూహకర్త ద్వారా బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో తాను సర్వే నిర్వహించానని, టీడీపీతో బీజేపీ పొత్తు పెట్టుకుంటేనే ఫలితాలు సానుకూలంగా ఉన్నాయని వ్యూహకర్త బీజేపీకి తెలియజేసినట్లు సమాచారం.

# పొత్తులపై క్లారిటీ వచ్చినట్టేనా

విజయవాడ, జూలై 21, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటన ఏపీ రాజకీయాలను కుదిపేస్తుంది. టీడీపీ, బీజేపీ పొత్తుపై మద్దతు కూడగట్టేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారని జోరుగా చర్చ సాగుతోంది. అమిత్ షా తో పవన్ భేటీ అనంతరం ఈ చర్చ మరింత పెరిగింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ బీజేపీ పెద్దలతో వరుసగా భేటీ అవుతున్నారు. బుధవారం ఉదయం ఏపీ బీజేపీ వ్యవహారాల ఇన్ ఛార్జ్, కేంద్ర మంత్రి మురళీధరన్ తో సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఏపీలో తాజా రాజకీయాలతో పాటు పొత్తులపై చర్చించినట్లు సమాచారం. బుధవారం ఢిల్లీలోనే ఉన్న పవన్... సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశం అయ్యారు. దాదాపుగా 15 నిమిషాల పాటు వీరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఎన్డీఏ పక్షాల సమావేశం కోసం ఢిల్లీ వెళ్లిన పవన్.. బీజేపీ కీలక నేతలతో సమావేశం అయ్యారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసిన పవన్ కల్యాణ్.. రాష్ట్రానికి చెందిన పలు అంశాలను చర్చించినట్టుగా తెలుస్తోంది. గురువారం కూడా పవన్ ఢిల్లీలోనే ఉండే అవకాశం ఉంది. ఈ పర్యటనలో పవన్ ఇంకెవరిని కలుస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. వచ్చే ఎన్నికల్లో ఏపీలో పొత్తులపై పవన్ బీజేపీ పెద్దలతో చర్చిస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది.ఎన్డీఏ సమావేశంలో ఏపీ విషయాలు ప్రస్తావనకు రాలేదని పవన్ కల్యాణ్ మీడియాతో అన్నారు. పవన్ ప్రకటనతో ఏపీని బీజేపీ లైట్ తీసుకుందా? అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతోంది. పొత్తు పెట్టుకున్నా, పొత్తులు లేకపోయినా తమకు వచ్చే నష్టమేం లేదని భావిస్తున్న బీజేపీ... ఏపీలో వ్యూహాత్మకంగా రాజకీయం చేస్తుంది. జనసేనతో పొత్తులో ఉన్న బీజేపీ...వైసీపీకి టచ్ లో ఉంది. అవసరం వచ్చినప్పుడు వైసీపీ బయట నుంచి బీజేపీ మద్దతుగా నిలుస్తోంది. బీజేపీతో పొత్తు కోసం టీడీపీ ప్రయత్నిస్తున్నా... ఆ విషయంలో బీజేపీ ఇంకా స్పందించలేదు. టీడీపీతో కలిస్తే వైసీపీ దూరమవుతుందని భావిస్తున్న బీజేపీ అధిష్ఠానం పొత్తులపై క్లారిటీ ఇవ్వడంలేదు. టీడీపీ, వైసీపీకి సమాన దూరంలో ఉంటూ రెండు పార్టీల మద్దతు పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అయితే జనసేన అధినేత పవన్ మాత్రం వైసీపీని అడ్డుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ, టీడీపీని దగ్గర చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ , టీడీపీ, జనసేన కూటమి పోటీ చేసే అవకాశం ఉందని పవన్ ఇప్పటికే ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వం రాకుండా చేయడమే జనసేన విధానం అని ప్రకటించారు. అందుకోసం

ఏ నిర్ణయానికైనా సిద్ధపడతామన్నారు. ఎన్డీఏ సమావేశానికి ఢిల్లీ వెళ్లిన పవన్ పొత్తులపై బీజేపీ మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది.ఏపీలో వచ్చే ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకుంటే జనసేన, బీజేపీకి కలిగే ఉపయోగాలను బీజేపీ అధిష్ఠానం దృష్టికి పవన్ తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలో పవన్ కల్యాణ్ ఇంకా ఎవరిని కలుస్తారు. పొత్తులపై ఏదైనా స్పష్టత వస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో జరిగిన సమావేశంపై పవన్ సోషల్ మీడియాలో స్పందించారు. హోంమంత్రి అమిత్ షాతో అద్భుతమైన సమావేశం జరిగిందన్నారు. ఈ సమావేశం ఏపీ ప్రజలకు నిర్మాణాత్మక, నిర్ణయాత్మక సుసంపన్నమైన భవిష్యత్తుకు దారితీస్తుందని కచ్చితంగా నమ్ముతున్నానని పవన్ అన్నారు. అమిత్ షాతో పవన్ భేటీపై ఏపీ రాజకీయాల్లో చర్చ మొదలైంది. పొత్తులపై చర్చించారా? బీజేపీ ఎలా స్పందించింది? ఇంతకీ టీడీపీతో పొత్తులంటాయా? అంటూ చర్చలు సాగుతున్నాయి.

# పట్టిసీమ నుంచి డెల్టాకు నీళ్లు

విజయవాడ, జూలై 21, ఏపీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. పట్టిసీమ ద్వారా మళీ కృష్ణా డెల్టా కు నీళ్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి అంబటి కీలక ప్రకటన చేశారు.పట్టిసీమ ద్వారా మళ్ళీ కృష్ణా డెల్టా కు నీళ్ళు ఇవ్వాలనీ నిర్ణయించామన్నారు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు. నాలుగేళ్ల తర్వాత మళ్లీ పట్టి సీమ ద్వారా నీళ్ళు ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. పులిచింతలలో నీటిని భవిష్యత్ అవసరాల కోసం నిల్వ ఉంచుతామని స్పష్టం చేశారు. నాగార్జున సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా కూడా 5 టీఎంసీల నీరు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పుకొచ్చారు.కృష్ణా నది ఎగువ నుంచి నీటి ప్రవాహం లేకపోవడంతో పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని లిఫ్ట్ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. నాలుగేళ్లుగా సకాలంలో వర్షాలు కురవడం., ఎగువ నుంచి నీరు విడుదల కావడంతో గోదావరి నీటి అవసరం కృష్ణా డెల్టాకు రాలేదన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో... పట్టిసీమ ద్వారానే మళ్లీ కృష్ణా డెల్టాలకు ఇవ్వాల్సి వస్తోందన్నారు.ప్రస్తుతం పోలవరం స్పిల్ వే నుంచి 5 లక్షల క్యూసెక్కుల వరద వెళ్తోందన్నారు మంత్రి అంబటి. ఇది 8 లక్షల క్యూసెక్కుల కు పెరిగే అవకాశం ఉందన్నారు. డయాఫ్రం వాల్ కొన్ని చోట్ల దెబ్బ తిందని... అయితే కొత్తది నిర్మించాలా లేక పాత దానికే మరమ్మతులు చేయాలా అన్నది నిర్ణయిస్తామన్నారు. ఈ విషయంపై కేంద్ర జల సంఘానికి నివేదిక ఇవ్వలేదని చెప్పుకొచ్చారు.ఎగువ రాష్ట్రాల్లో భారీవర్షాలు వల్ల స్వల్పంగా ఏపీలోని గోదావరి తీర ప్రాంతాల్లో కూడా వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ముందస్తు చర్యలు చేపట్టింది. ముందస్తుగా ప్రభావిత జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఎప్పటికప్పుడు పరిస్థితులు పర్యవేక్షిస్తోంది. ముందస్తు సహాయక చర్యలకు అల్లూరికు ఎన్డీఆర్ఎఫ్, ఏలూరుకు రెండు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను తరలించింది. విపత్తుల నిర్వహణ సంస్థలో స్టేట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. అత్యవసర సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే స్టేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 1070, 18004250101 ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాల్లో మండలస్థాయిలో కూడా అధికారులు కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించింది. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని? బోట్లు, మోటర్ బోట్లు, స్టీమర్లలతో నదిలో ప్రయాణించడం చేయరాదని స్పష్టం చేశారు. వరద నీటిలో ఈతకు వెళ్ళడం, చేపలు పట్టడం లాంటివి చేయరాదని పేర్కొంది.గోదావరికి భారీగా వరద కొనసాగుతోంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో పాటు తెలంగాణలోనూ భారీగా వానలు పడుతున్నాయి. ఫలితంగా గోదావరి నదిపై ఉన్న ప్రాజెక్టులు ఉప్పొంగుతున్నాయి. భద్రాచలం వద్ద నీటిమట్టం 40 అడుగులు దాటిపోవటంతో? ప్రమాద హెచ్చరికలు జారీ కానున్నాయి.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం వద్ద వరద ఉధ్ధృతి క్రమంగా పెరుగుతోంది. ఉదయం 11 గం.ల సమయానికి 41.3 అడుగులకు నీటి మట్టం చేరింది. 43 అడుగులకి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు అధికారులు.గోదావరిలో ఎగువన ప్రవాహం నామమాత్రంగా ఉన్నప్పటికీ.. కాళేశ్వరం వద్ద గోదావరిలో ప్రాణహిత కలిసిన తర్వాత వరద ఉధ్ధృతి పెరుగుతోంది. దీంతో పరిసర ప్రాంతాలను అప్రమత్తం చేస్తున్నారు అధికారులు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించనున్నారు. భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డా ప్రియాంక అలా ఎప్పటికప్పుడు యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. సిబ్బంది కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలని అదేశించారు.

24 గంటలు పనిచేయు విధంగా కలెక్టరేట్ తో పాటు కొత్తగూడెం, భద్రాచలం ఆర్డిఓ కార్యాలయాలు అలాగే చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. భద్రాచలం వద్ద వరద ఈ రోజు సాయంత్రం వరకు మొదటి ప్రమాద హెచ్చరిక వరకు చేరే అవకాశం ఉన్నదని యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఏ ఒక్క ప్రాణానికి హాని కలుగకుండా ప్రజలకు కానీ పశువులకు కానీ చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఎప్పటికపుడు యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేస్తున్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. కాళేశ్వరం దగ్గర గోదావరి, ప్రాణహిత నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. పుష్కరఘాట్ వద్ద 9.770 మీటర్ల ఎత్తులో ఈ రెండు నదులు ప్రవహిస్తున్నాయి. మేడిగడ్డ, లక్ష్మీ బ్యారేజ్ 57 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం 4,85,030 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి పాల్వంచ కిన్నెరసాని ప్రాజెక్టుకు భారీగా చేరుతున్న వరదనీరు చేరుతుంది. ఉనిఎబజు;కిన్నెరసాని ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 407 అడుగులు. కాగా? ప్రస్తుతం నీటి మట్టం 399.80 అడుగులుగా ఉంది.కడెం ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 700 అడుగులు కాగా, 690.500 అడుగులకు చేరింది. కడెం ప్రాజెక్టుకు 7,283 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఒక గేటును ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# ఆగస్టు 5 నాటికి చంద్రుడి దగ్గరకు చంద్రయాన్

నెల్లూరు, జూలై 21, చంద్రయాన్ ప్రయోగంలో మరో అడుగు పడింది. గురువారం నాల్గోసారి ఉపగ్రహం కక్ష్య (ఎర్త్ బౌండ్ ఆర్బిట్ మాన్యువర్)ను ఇస్రో పెంచింది. ప్రస్తుతం చంద్రయాన్-3 ఉపగ్రహం 51400 కిమీ లీ 228 కిలోమీటర్ల దూరంలో భూ కక్ష్యలో తిరుగుతోంది. వచ్చే నెల 5న చంద్రుడి కక్షలోకి చేరుకుంటుందని ఇస్రో అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 14న శ్రీహరికోట నుంచి చంద్రయాన్ నింగిలోకి దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఇస్రో చంద్రయాన్ ప్రయాణాన్ని క్షుణ్ణంగా పరీక్షిస్తోంది. దశలవారిగా క్రమక్రమంగా ఇంజిన్‌ను మండించి కక్ష్యను పెంచుకుంటూ వెళ్తోంది.చంద్రయాన్ భూకక్షలో ప్రవేశించిన తరువాత ఇస్రో మూడుసార్లు కక్ష్యను పెంచింది. తాజాగా గురువారం నాల్గోసారి ఉపగ్రహం కక్ష్యను పెంచింది. ఈ నెల 25న మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్య మరోసారి ఇంజిన్‌ను మండించి కక్ష్యను పెంచనుంది. వచ్చే నెల 5 నాటికి చంద్రుడి కక్షలోకి చేరుకోనుంది. ఆగస్టు 23, 24 వరకు చంద్రుడిపై ల్యాండ్ చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.చంద్రయాన్ 3ని బాహుబలి రాకెట్‌గా చెప్పిన ఇస్రో ఆ తరవాత దానికి లాంచ్ వెహికల్ మార్క్ 3 గా పేరు పెట్టింది. దీని బరువు 642 టన్నులు. బరువు 3,921కిలోలు. భూమి నుంచి చంద్రుడి వరకూ దాదాపు 4 లక్షల కిలోమీటర్ల వరకూ ప్రయాణిస్తుంది. 24 రోజుల పాటు ఇది భూమి చుట్టూ ప్రదక్షిణలు చేయనుంది. ఆగస్టు 23 లేదా 24 న చంద్రుడి ఉపరితలంపై ల్యాండ్ అవుతుందని ఇస్రో అంచనా వేస్తోంది. ల్యాండర్, రోవర్ మాడ్యూల్ వేరువేరుగా ఉన్న ఈ స్పేస్ క్రాఫ్ట్ చంద్రుడి సౌత్ పోల్‌కి సమీపంలో ల్యాండ్ అవ్వనుంది. ప్రపల్షన్ మాడ్యూల్ భూమి చుట్టూ పలుసార్లు తిరిగి చంద్రుడిపై దిగుతుంది. చంద్రుడిపై గ్రావిటీకి తగ్గట్టుగా మాడ్యూల్ మెల్లగా కిందకు దిగుతుంది. ల్యాండర్ విడిపోతుంది. లాంఛ్ అయినప్పటి నుంచి సరిగ్గా నెల రోజుల తరవాత చంద్రుడిపై మాడ్యూల్ దిగుతుంది.చైనా, రష్యాలు జంబో రాకెట్లను ఉపయోగించి చంద్రుడిపైకి ఉపగ్రహాలను పంపించాయి. చైనా, అమెరికా దాదాపు రూ.1000కోట్ల వరకు ఖర్చు చేస్తుండగా.. అయితే ఇస్రో రూ.500కోట్ల

నుంచి రూ.600 కోట్లతోనే ప్రయోగం చేపడుతోంది. చంద్రుడి కక్ష్య వరకు వెళ్లే శక్తివంతమైన రాకెట్ సైతం ఇస్రో వద్ద లేకపోయినా క్లిష్టమైన ప్రక్రియలో ప్రయోగం చేపట్టింది. భారత్ సత్తా ప్రపంచమంతా చాటేలా ప్రయోగం చేసింది.ఇటలీలోని మన్సియానోకు చెందిన వర్చువల్ టెలిస్కోప్ ప్రాజెక్ట్ అంతరిక్షంలో తిరుగుతూ చంద్రుడి వైపు ప్రయాణిస్తున్న చంద్రయాన్-3ను చిత్రీకరించింది. అందులో చంద్రయాన్-3 ఓ చుక్కలా వేగంగా ప్రయాణిస్తోంది. భూమికి 341 కిలోమీటర్ల ఎత్తులో చంద్రయాన్-3 కదలికలను వర్చువల్ టెలిస్కోప్ గుర్తించింది. ఈ వీడియో సోషల్ మీడియాలో ట్రెండింగ్ అయ్యింది. ఇటలీకి చెందిన ఈ వర్చువల్ టెలిస్కోప్ ఖగోళానికి చెందిన పలు విషయాలను ఎప్పటికప్పుడు గుర్తించి సమాచారం ఇస్తూ ఉంటుంది. చంద్రయాన్-3 విషయంలోను ఈ టెలిస్కోప్ తన పనితనం, నైపుణ్యం ప్రదర్శించింది.

# పవన్ పై లీగల్ ఫైట్

విజయవాడ, జూలై 21, వలంటీర్లపై పవన్ చేసిన వ్యాఖ్యలపై ఏపీ సర్కార్ న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. ఈ మేరకు గురువారం స్పెషల్ సీఎస్అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.: గ్రామ, వార్డు వలంటీర్లను ఉద్దేశిస్తూ జనసేన అధినేత పవన్ చేసిన వ్యాఖ్యలను సీరియస్ గా తీసుకుంది ఏపీ సర్కార్. ఆయన చేసిన వ్యాఖ్యలపై కోర్టుకు వెళ్లాలని నిర్ణయించింది. ఈ మేరకు గురువారం స్పెషల్ సీఎస్అజయ్ జైన్ పేరిట ఉత్తర్వులు జారీ అయ్యాయి. 1973 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం పవన్ కల్యాణ్ పై చర్యలకు సిద్ధమైంది సర్కార్. వలంటీర్లపై ఉద్దేశపూర్యకంగా తప్పుడు ఆరోపణలు చేసినందుకు పరువు నష్టం కేసు దాఖలు చేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కు ఆదేశాలు జారీ చేసింది. మహిళా వలంటీర్లను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది.క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ - 1973 ప్రకారం పవన్ కల్యాణ్ పై చర్యలకు సిద్ధమైంది ఏపీ సర్కార్. వలంటీర్లపై ఉద్దేశపూర్యకంగా తప్పుడు ఆరోపణలు చేసినందుకు పరువు నష్టం కేసు దాఖలు చేయాలని పీపీకి ఆదేశాలు జారీ చేసింది. మహిళా వలంటీర్లను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు స్పష్టం చేసింది. సీపీసీ 119/4 ప్రకారం కేసుల నమోదుకు అనుమతిస్తూ ఉత్తర్వులు ఇస్తున్నట్లు తెలిపింది. జులై 9వ తేదీన ఏలూరులో తలపెట్టిన వారాహి విజయ యాత్రలో చేసిన వ్యాఖ్యల విషయంలో పవన్ ను విచారించేందుకు అనుమతి ఇస్తున్నట్లు జీవోలో ప్రస్తావించింది.ఇక ఏపీ ప్రభుత్వ జీవోపై పవన్ స్పందించారు. పంచకర్ల రమేశ్‌బాబు గురువారం మంగళగరిలోని కార్యాలయంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడిన పవన్ కల్యాణ్... వలంటీర్లపై మాట్లాడినందుకు ప్రాసిక్యూట్ చేయమని వైసీపీ ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. అవసరమైతే తనని అరెస్ట్ చేసుకోవచ్చని... చిత్రహింసలు కూడా పెట్టుకోవచ్చంటూ కామెంట్స్ చేశారు. జైలుకెళ్లడానికైనా సిద్ధమేనని స్పష్టం చేశారు. ప్రాసిక్యూషన్ అంటే సిద్ధంగానే ఉన్నానని తెలిపారు." నన్ను ప్రాసిక్యూట్ చేయమని ఆర్డర్ ఇచ్చారు. గుర్తుపెట్టుకో జగన్ నీ ప్రభుత్వాన్ని కిందకి లాగేది ఇదే" అంటూ కామెంట్స్ చేశారు పవన్ కల్యాణ్.

# నివేదికలు ఆధారంగానే టిక్కెట్లు

తిరుపతి, జూలై 21, న్నికలు దగ్గరపడుతున్న వేళ వైసీపీ అధినేత జగన్ కీలక నిర్ణయాలను తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. త్వరలోనే ప్రజాప్రతినిధులతో భేటీ కానున్నారు. ఇప్పటివరకు అందిన సర్వేల నివేదికల ఆధారంగా... మార్పులపై చర్చించే అవకాశం ఉంది.ఎన్నికలకు ఏడాది సమయం ఉండగానే ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి... సంచలన విజయాన్ని అందుకున్న వైసీపీ... ఈసారి కూడా సింగిల్ గానే పోటీ చేస్తామని చెప్పింది. అందుకు తగ్గట్టుగానే వ్యూహాలు, ప్రతివ్యూహాలను సిద్ధం చేసే పనిలో ఉంది. మరోవైపు టీడీపీ, జనసేన, బీజేపీ మైత్రి ఖరారయ్యే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది. ఇప్పటికే పవన్ తీవ్రస్థాయిలో వైసీపీపై విమర్శలు, ఆరోపణలు గుప్పిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించటమే తమ లక్ష్యమని... అందుకోసం కలిసివచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకుంటామని కూడా చెప్పారు. ఫలితంగా ఏపీలో మరోసారి కూటమి తెరపైకి రావటం ఖాయంగా కనిపిస్తోంది. ఈ పరిణామాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్న వైసీపీ... పక్కాగా అడుగులు వేయాలని చూస్తోంది. ఇప్పటికే పలు నివేదికలు అందుకున్న అధినేత... పార్టీ, ప్రభుత్వ పరంగా పలు నిర్ణయాలు తీసుకుంటారనే చర్చ వినిపిస్తోంది.వచ్చే నెల మూడో వారం నుంచి ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులతో ముఖ్యమంత్రి జగన్ సమావేశమవుతారని తెలుస్తోంది. ఇప్పటికే పలు నివేదికలు సిద్ధమయ్యాయి. ఇవన్నీ కూడా జగన్ చేతికి అందినట్లు సమాచారం. స్వాతంత్ర దినోత్సవం తర్వాత వరస సమావేశాలను నిర్వహించాలని భావిస్తున్న జగన్... ఈలోపు కొన్ని రీజినల్ ఇంఛార్జ్‌లను మార్చాలని చూస్తున్నారు. ఇక నామినేటెడ్ పదవుల భర్తీ, మార్పులపై కూడా దృష్టి పెట్టనున్నారు. ఇంతేకాకుండా మీడియా, సోషల్ మీడియా, నేషనల్ మీడియా ప్రముఖులతో కూడా సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. వారిచ్చే నివేదికలు ఇతర సంస్థల నుంచి వచ్చే నివేదికల ఆధారంగా మార్పులు చేర్పులు చేసే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తోంది. మరో వైపు టీటీడీ ఛైర్మన్‌గా ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పేరు ముఖ్యమంత్రి జగన్ పరిశీలిస్తున్నట్లు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం వైవీ సుబ్బారెడ్డిఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. రెండో టర్మ్ కూడా పూర్తి కావొస్తోంది. దీంతో ఆయన స్థానంలో జంగా కృష్ణమూర్తికి అవకాశం ఇచ్చే ఉంది.

# అన్న సైలెంట్ తమ్ముడు దూకుడు

అనంతపురం, జూలై 21,అనంతపురం రాజకీయాల్లో జేసి దివాకర్ రెడ్డిది ఓ ప్రత్యేకమైన అధ్యాయం ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ నేతగా జిల్లా రాజకీయాలను శాసించారు. తాడిపత్రి నుంచి అప్రతిహతంగా గెలుస్తూ వచ్చారు. అయితే గత ఎన్నికల్లో రిటైర్మెంట్ తీసుకుని కుమారుడ్ని ఎంపీగా నిలబెట్టారు.కానీ పరాజయం పాలయ్యారు. ఆయన సోదరుడు జేసీ ప్రభాకర్ రెడ్డి ఇటీవలి కాలంలో చాలా యాక్టివ్ గా ఉంటున్నారు. కానీ దివాకర్ రెడ్డి మాత్రం సైలెంట్ గా ఉంటున్నారు. ఆయన కుమారుడు పవన్ కుమార్ రెడ్డి కూడా పెద్దగా యాక్టివ్ గా కనిపించడం లేదు. దీంతో వారు వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అన్న చర్చ జరుగుతోంది. స్వపక్ష నేతలైనా, విపక్ష నేతల గురించి అయినా నిర్మోహమాటంగా మాట్లాడే జేసీ దివాకర్ రెడ్డి.. తరచూ వార్తల్లో ఉంటారు. కొంత కాలంగా ఆయన రాజకీయపరమైన వ్యాఖ్యలేవి చేయకుండా మౌనంగా ఉంటున్నారు. 1983లో తొలిసారిగా రాజకీయ రంగ ప్రవేశం చేసి స్వతంత్రంగా ఆ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తరువాత 1985లో కాంగ్రెసు పార్టీ తరుపున తొలిసారిగా పోటీ చేశారు. అప్పటి నుంచి 2009 వరకు కాంగ్రెసుపార్టీ తరుపేనే పోటీ చేసి డబుల్ హ్యాట్రిక్ విజయాలను సాధించారు. ఆ తరువాత 2014లో టీడీపీలో చేరి పార్లమెంటుకు పోటీ చేశారు. ఈ ఎన్నికల్లోనూ ఆయనే విజయం సాధించారు. ఇక 2019 ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. ఆయన తనయుడు జెసి. పవన్‌కుమార్‌రెడ్డి తొలిసారిగా పోటీ చేశారు. ఆయన ఓటమి చెందారు. 2019 ఎన్నికల్లో ఓటమి తరువాత కూడా రాజకీయంగా హడివుడే చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిపైనా అనేక విమర్శలు చేశారు. ఇదే సమయంలో ప్రభుత్వం వైపున ఉంచి ఆయనకు సంబంధించి గనులను మూసివేయడం తదితర సమస్యలు చుట్టుముట్టినా తన విమర్శల పదునును తగ్గించలేదు. కొంత కాలంగా వీటికి దూరంగా ఉంటూ, ఎటువంటి రాజకీయపరమైన వ్యాఖ్యలు చేయకుండా మౌనంగా ఉంటూ వస్తున్నారు. త్వరలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలోనూ ఆయన రాజకీయపరంగా యాక్టివ్‌గా లేకపోవడం చర్చనీయాంశం అవుతోంది. ఆయన తనయుడు పవన్‌కుమార్‌రెడ్డి కూడా రాజకీయపరమైన కార్యక్రమాల్లో పాల్గొనటం లేదు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలో కేశ్ పాదయాత్రలోగాని, పార్టీ కార్యక్రమాల్లోనూ ఎక్కడా కనిపించటం లేదు.

## కాంగ్రెస్ సేవాదళ్ మహిళా విభాగం సిటి చైర్మన్ గా పి రాధిక.





కర్నూలు జూలై 21 విభారె న్యూస్.జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ మహిళా విభాగం సిటి చైర్మన్ గా పి రాధిక నియమితులయ్యారు. కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎం సుధాకర్ బాబు సూచన మేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు,రాష్ట్ర సేవాదళ్ చైర్మన్ ఎలమందారెడ్డి ఆదేశాల మేరకు జిల్లా మహిళా సేవాదళ్ చైర్మన్ ఏ వెంకట సుజాత సేవాదళ్ సిటీ చైర్మన్ గా పి రాధికను నియమించారు. రాధిక శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎం సుధాకర్ బాబు ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి కండువాతో సన్మానించి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం వచ్చే ఎన్నికల్లో కృషి చేస్తానని రాహుల్ గాంధీ ని ప్రధాని చేయడమే సేవాదళ్ లక్ష్యమని, సేవాదళ్ మహిళా విభాగాన్ని నగరంలో బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి కే సత్యనారాయణ గుప్త కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా చైర్మన్ సజ్జాద్ హుస్సేన్ ఎన్ లక్ష్మి దేవమ్మ కే మాధవి మొదలగు మహిళలు పాల్గొన్నారు.

## దంపతుల మధ్య ఘర్షణ..

-నాలుక కొరికేసిన భార్య




తుగ్గలి జులై 21 విభారె న్యూస్.మండలంలో భార్యభర్తల మధ్య జరిగిన ఘర్షణలో భార్య.. భర్త నాలుక కొరికిన ఘటన కలకలం రేపింది. శుక్రవారం ఎల్లమ్మ గుట్ట తండాకు చెందిన భార్య పుష్పావతి, భర్త చందు నాయక్ మధ్య కుటుంబ కలహాల నేపథ్యంలో ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో భార్య ఒక్కసారిగా భర్తపై పడి అతడి నాలుక కొరికి వేసింది. దీంతో తీవ్రంగా గాయపడిన చందునాయకు చికిత్స నిమిత్తం గుత్తి ఆసుపత్రికి తరలించారు.

## శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థానం రాజగోపురం నిర్మాణం కొరకు హైదరాబాద్ వాస్తవ్యుల విరాళం.



కౌతాళం జూలై 21 విభారె న్యూస్.శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థాన రాజగోపుర నిర్మాణం, శాశ్వత అన్నదానం కొరకు హైదరాబాద్ వాస్తవ్యులు కనకండ్ల వెంకటేష్ వారు లేట్ రాయదుర్గం ఈరమ్మ పేరుపై రు.1,21,000/- ను విరాళంగా చెల్లించియున్నారు. దాతలకు దేవస్థాన ఆలయ అధికారులు శ్రీ స్వామి దర్శనం, స్వామివారి శేష వస్త్రాము, లడ్డూ ప్రసాదాలు,ఆశీర్వాదాలు కల్పించి,బాండు పేపర్, శ్రీ స్వామి వారి ఫోటోను అందించి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అర్చకులు శివపుత్ర స్వామి, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాధాకృష్ణమూర్తి.



కోడుమూరు జులై 21 విభారె న్యూస్.అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే కు కోడుమూరు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి దామోదరం రాధా కృష్ణమూర్తి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూల బొకేను అందిస్తూహృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## జగనన్న సురక్ష పేద ప్రజలకు అండగా-ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి.





ఎమ్మిగనూరు జులై 21 విభారె న్యూస్. శుక్రవారం నాడు మండల పరిధిలోని మసీదుపురం నందు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి లబ్ధిదారులు జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇన్కమ్ సర్టిఫికెట్,క్యాస్ట్ సర్టిఫికెట్, వైస్సార్ ఆరోగ్య శ్రీ, రైస్ కార్డు, బర్త్ సర్టిఫికెట్, ఫ్యామిలీ సర్టిఫికెట్ లు అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ అర్హులై ఉండి ఏ ఒక్కరూ లబ్ధి అందకుండా మిగిలి పోకూడదన్న తపన, తాపత్రయంతో ప్రతి ఇంట్లో ఏ చిన్న సమస్య ఉన్నా దానిని పరిష్కరించాలన్న చిత్తశుద్ధితోనే "జగనన్న సురక్ష" కార్యక్రమాన్ని ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నెలరోజులపాటు నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని అందుబాటులోకి తెచ్చారని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో శాచ్యురేషన్ పద్ధతిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ మంచి చేసిన జగనన్న ప్రభుత్వం. అర్హులై ఉండి ఏ కారణంతోనైనా ఇంకా ఎవరైనా మిగిలిపోతే వారికి కూడా సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో ఈ 'జగనన్న సురక్ష' ద్వారా ఇంటింటినీ జల్లెడ పట్టనుందని, తద్వారా వారికి లబ్ధి చేకూర్చడంతో పాటు వారికింకేమైనా సర్టిఫికెట్లు (జనన, మరణ, కుల, సీసీఆర్సీ, రేషన్ కార్డు డివిజన్, హౌస్ హోల్డ్ డివిజన్, ఇన్‌కమ్ మొదలైన 11 రకాల ధ్రువీకరణపత్రాలు) అవసరమైతే సర్వీస్ ఫీజు లేకుండా వాటిని ఉచితంగా అందించనుందని తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు, ఎంపీపీ, సర్పంచ్, ఇన్ చార్జ్ లు, వివిధ శాఖ అధికారులు, లబ్ధిదారులు, సచివాలయం సిబ్బంది, వాలెంటర్స్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పారిశుద్ధ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

ఏఐటీయూసీ రాయలసీమ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు వినతి



కర్నూలు, జులై 21విభారె న్యూస్ : రాయలసీమ ప్రాంత మున్సిపల్ పారిశుద్ధ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటియుసి అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమాముల సుబ్బరాయుడు శుక్రవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాయలసీమ రీజినల్ డైరెక్టర్ పీవీ వివిఎస్ .మూర్తికి అనంతపురంలో వినతి పత్రాన్ని సమర్పించారు ఈ సందర్భంగా పోరిమావుల సుబ్బరాయుడు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుద్ధ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు ఔట్సోర్సింగ్ కార్మికులకు నేతలతో పాటు మెడికల్ అలవెన్స్ ప్రతి నెల ఒకటో తేదీన చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు 202 2 జూలై మాసం సమ్మె కాలపు వేతనాన్ని చెల్లించాలన్నారు పర్మనెంట్ కార్మికులకు 2022. 2023 రెండు సంవత్సరముల సరెండర్ లీవ్ వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు జిపిఎఫ్ ఖాతాలు తెరవాలన్నారు కర్నూల్ నగరపాలక సంస్థలు లో దీర్ఘకాలికంగా నెలకొన్న ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు కర్నూల్ నగరపాలక సంస్థలో విలీన మైన పంచాయితీల జనాభా కలుగునంగా పారిశుద్ధకార్మికుల సంఖ్యను పెంచాలన్నారు కార్మికులపై పని భారాన్ని తగ్గించాలన్నారు కర్నూలు సంస్థలు ప్రతి ఆదివారం పర్మినెంట్ కార్మికులకు పూర్తి సెలవు దినములను ఇవ్వలన్నారు ఔట్సోర్సింగ్ కార్మికులకు మే జూన్ మాసముల మెడికల్ అలవెన్స్నుతక్షణమే ఇవ్వాలన్నారు సకాలంలో పని ముట్లను ఇప్పించాలన్నారు ఔట్సోర్సింగ్ కార్మికులకు



యూనిఫామ్ దుస్తులు కొబ్బరి నూనె సబ్బులు ఇవ్వాలన్నారు టైం స్కేల్ కార్మికులకు పర్మనెంట్ చేయాలన్నారు కేర్ టేకర్ (మరుగుదొడ్ల సుబ్రం చేయు కార్మికులకు) ఔట్సోర్సింగ్ కార్మికులకు మెడికల్ అలవెన్స్ ను వర్తింపచేయలన్నారు వినతి పత్ర కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కర్నూలు జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి కర్నూల్ నగర కార్యదర్శి జి చంద్రశేఖర్ అనంతపురం ఏఐటీయూసీ జిల్లాఅధ్యక్షుడు రాజేష్ గౌడ్ ఉన్నారు.


## కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ



కర్నూలు, జులై 21విభారె న్యూస్ :నిజాం వైద్య విజ్ఞాన సంస్థలో జరిగిన ఫాకల్టీ ప్రమోషన్స్ ప్రోగ్రాంకు ఫ్యాకల్టీ ఎక్స్పర్ట్ గా వెళ్లడం జరిగింది.. తర్వాత నిజాంస్ ఇన్స్టిట్యూట్లో పనిచేసే కార్డియోతొరాసిక్ సర్జన్ ఆర్ వి కుమార్ , అమరేష్ నన్ను సన్మానించడం జరిగింది.. అక్కడ చిన్నపిల్లల కార్డియాక్ ఆపరేషన్ విభాగంలో నూతనంగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నిర్మించిన ఓ అధునాతనమైన బ్లాక్ ను సందర్శించడం జరిగింది. ఈ వార్డులో అధునాతనమైన పరికరాలు వసతులు అన్నీ కూడా ఓ ప్రైవేట్ కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నిర్మించడం జరిగింది. అంతేకాకుండా వాళ్లు కొన్ని ఎక్విప్మెంట్ కూడా ఇవ్వడం జరిగింది. ఈ విధంగా వారు ఉచితంగా ప్రభుత్వానికి నిర్మించి ఇవ్వడం వల్ల ప్రజలకు చాలా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి..మన కర్నూలు చుట్టుపక్కల ఎన్నో సిమెంట్ కంపెనీలు మరియు సోలార్ కంపెనీలు మైనింగ్ సంస్థలు ఉన్నా కానీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వార్డులను నిర్మించి ఇవ్వడం, పరికరాలు ఇవ్వడం కానీ చాలా తక్కువ.. అదే వైజాగ్ హైదరాబాదులో ఇటువంటి కార్యక్రమాలు డోనేషన్స్ ఎక్కువగా జరుగుతుంటాయి.. మనకు కూడా రాయలసీమలో వెనుకబడిన ప్రాంతం కావున ఇక్కడ కూడా సిఎస్ఆర్ కింద వార్డులను ఉచితంగా నిర్మాణం చేస్తే చాలా బాగుంటుంది...ఆ తర్వాత జి వి కె మాల్లో షాపింగ్ చేసుకొని, మన ఫేస్బుక్ మిత్రుడు రాచర్ల శివతో కలిసి ముచ్చటించడం జరిగింది.. పక్కా లోకల్ రెస్టారెంట్లో లంచ్ చేశాం .. ఆ రెస్టారెంట్ పక్క లోకల్ గానే ఉంటుంది.. క్రిస్పీ కోకోనట్ గా మరియు చిట్టి ముత్యాల బిర్యాని చాలా బాగుంది.. జలవనరుల గురించి సమకాలీన రాజకీయ విషయాల గురించి సామాజిక సేవ గురించి చరిత్ర గురించి శివ తో మాట్లాడుతూ ఉంటే కాలమే తెలియలేదు.. అక్కడినుండి తిరిగి కర్నూలుకు మధురానుభూతులతో ప్రయాణమయ్యాను..

## అహోబిలం క్షేత్రంలో నేడు శ్రీ గోదాదేవి కళ్యాణం

ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు



ఆళ్లగడ్డ ప్రతినిధి జులై 21 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దిగువ అహోబిలంలో రేపు అనగా శనివారం శ్రీ గోదాదేవి ఆండాళ్ అమ్మవారి తిరు నక్షత్రాన్ని పురస్కరించుకొని గోదా కళ్యాణం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ కర్కాటక మాసం పూర్వ ఫల్గుణి నక్షత్రం రోజున విష్ణు చిత్తుడు అనే ఆల్వార్ కు గోదాదేవి జన్మించిన రోజు అని వేణుగోపాల్ స్వామి తెలిపారు. అహోబిలం 46వ పీఠాధిపతి శ్రీ వన్ శఠగోప శ్రీ రంగనాథ యతేంద్ర మహాదేసికన్ స్వామి ఆధ్వర్యంలో శ్రీవారి కళ్యాణం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులంతా పాల్గొని శ్రీ స్వామివారి కృపకు పాత్రులు కావాలని ప్రధానార్చకులు వేణుగోపాలస్వామి తెలియజేశారు.

## సోమవారం షష్టి సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు.



కర్నూలు జూలై 21 విభారె న్యూస్.పట్టణంలో వేంచేసి ఉన్నటువంటి శ్రీ ఛాయా ఉష సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానము నందు శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి ఆశీర్వాదంతో24-07-2023 సోమవారం శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి సుబ్రహ్మణ్య షష్ఠి. ఈ యొక్క షష్ఠి నాడు ఎవరైతే సుబ్రహ్మణ్య ఆరాధన చేసుకుందురో వారికి దీర్ఘకాలముగా దోష నివారణలు కలుగును.కావున ఉదయం 7 గంటల నుండి అభిషేకములు జరుగును.కావడి సేవలు.భస్మార్చనలు.(వివాహం కానటువంటి వారికి సంతానం లేనటువంటి వారికి వివిధ గ్రహస్థితుల అనుకూలంగా లేకుండా ఇబ్బంది పడేటువంటి వారికి. రాహు కేతువులు మరియు సర్ప దోషములు కలిగినటువంటి వారికి.ప్రత్యేకముగా శ్రీ సుబ్రమణ్య హోమం జరుపబడును.అభిషేకం రుసుము 200/-కావడి సేవలు250/-భస్మార్చనలు 50/-హోమం రుసుము 3500/-సంప్రదించవలసిన నెంబరు7995202082శ్రీధర శర్మ: 8896123777.

## ఆర్థిక సాయం అందించిన జనసేన నాయకులు



ఎమ్మిగనూరు టౌన్ జూలై 21 విభారె న్యూస్:-కిడ్నీ వ్యాధిగ్రస్తురాలకి జనసేన నాయకులు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు జనసేన కార్యకర్త శ్రీవారి వెంకటేష్ భార్య సౌజన్య కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది ఈ విషయం తెలుసుకున్న జనసేన నాయకులు రాహుల్ సాగర్ రవి ప్రకాష్ రవి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేన కార్యకర్తలు ఆపదలో ఉంటే ఆదుకోవాలని సంకల్పంతో బాధితురాలికి రూ 10,000వేలు ఇస్తున్నన్నారు ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## కో-ఆపరేటివ్ స్టోర్స్ ను సందర్శించిన ఎమ్మెల్యే



ఎమ్మిగనూరు టౌన్ జూలై 21 విభారె న్యూస్:-పట్టణంలోని ఎమ్మిగనూరు కోపరేటివ్ స్టోర్స్ ను స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి శుక్రవారం సందర్శించారు. కార్యవర్గం చైర్మన్ ,సభ్యులు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోఆపరేటివ్ స్టోర్స్ అభివృద్ధికి కృషి చేయాలని చైర్మన్ షబ్బీర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్ సంఘం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్ లో మహిళలపై అత్యాచారానికి పాల్పడిన మృగాలను కఠినంగా శిక్షించాలి........

సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య



కర్నూలు, జులై 21విభారె న్యూస్ :మణిపూర్ లో ముగ్గురు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి, తండ్రి, సోదరున్ని హత్య చేయడాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తీవ్రంగా ఖండించారు. గత మూడు నెలల కాలం నుంచి మణిపూర్ రాష్ట్రం అగ్నిగుండం గా మారి హింస జరుగుతుంటే, ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం వాటిని అరికట్టడంలో పూర్తిగా విఫలమైందని, మణిపూర్ రాష్ట్రం అగ్నిగుండంగా మారి హింస జరుగుతున్న మోడీ వాటిపై నోరు విప్పకుండా, హింసకు పాల్పడుతున్న వారికి వత్తాసు పలకడం దేశ ప్రతిష్ట మంట కలిసిందని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో గిరిజనులు, ఆదివాసీల మహిళల పై అత్యాచారాలు, అఘాయిత్యాలకు పాల్పడే వారికి అండగా ఉండటం సిగ్గుచేటైన విషయమని, తక్షణమే మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన మానవ మృగాలను, దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190